## కిరండోల్ రైళ్లకు అదనపు విస్టాడోమ్, ఏసీ కోచ్

**విశాఖపట్నం, సెప్టెంబరు 12:** పర్యాటకుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాఖ, కిరండోల్ మధ్య రాకపోకలు సాగించే రైళ్లకు అదనంగా ఒక విస్టా డోమ్ కోచ్, థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌లను జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ నెల 14, 21, 28 విశాఖ- కిరండోల్ వెళ్లే రైలుకు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 15, 22, 29 తేదీల్లో కిరండోల్ - విశాఖ వచ్చే రైలుకు ఒక విస్టాడోమ్ కోచ్ అందుబాటులో ఉంటుందన్నారు. ఈ నెల 15, 22, 29న విశాఖ- కిరండోల్, ఈ నెల 16, 23, 30న కిరండోల్- విశాఖ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్‌ను జత చేస్తున్నామన్నారు.

# వరద నష్టం అపారం

- జిల్లాలో ఘోరంగా దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- జీకేవీధి- సీలేరు మెయిన్‌రోడ్డు ఛిద్రం
- 2,398 హెక్టార్లలో పంట నష్టం, 225 ఇళ్లు ధ్వంసం
- మొత్తం నష్టం రూ.16 కోట్ల 26 లక్షలుగా ప్రాథమిక అంచనా

(పాడేరు-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో జిల్లాలో కురిసిన భారీ వర్షాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లాలోని 21 విభాగాల్లో జరిగిన నష్టం రూ.16 కోట్ల 26 లక్షల 24 వేలుగా అధికారులు గుర్తించారు. భౌగోళికంగా జిల్లా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలకు సరిహద్దులో ఉండడంతో ఎక్కడ అల్పపీడనం లేదా వాయుగుండం ఏర్పడినా దాదాపు అన్ని మండలాలపై ప్రభావం చూపుతున్నది.

తీవ్ర వాయుగుండం ప్రభావంతో మొత్తం జిల్లాలోని 22 మండలాల్లో వర్షాలు కురిశాయి. భారీ వర్షాలకు 14 గ్రామాలు ప్రభావితం కాగా, 2398 హెక్టార్లలో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయ రంగానికి రూ.3.29 కోట్ల నష్టం వాటిల్లింది. మొత్తం 225 ఇళ్లు ధ్వంసం కాగా, వాటిలో 200 పాక్షికంగా, మిగిలిన 25 వివిధ దశల్లో దెబ్బతినడంతో మొత్తం రూ.32 లక్షల 82 వేలు నష్టం కలిగింది. రూ.16 వేలు విలువ చేసే 2 పాకలు, రూ.9.75 లక్షల విలువ చేసే పశు సంపదకు నష్టం వాటిల్లింది. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో సుమారుగా 30.5 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం కాగా, నష్టాన్ని రూ.4 కోట్ల 5 లక్షలుగా గుర్తించారు. ఇందులో జీకేవీధి నుంచి సీలేరు వెళ్లే మెయిన్‌రోడ్డు ఎక్కువగా దెబ్బతిన్నది. ఆ మార్గంలో రోడ్డుతో పాటు కొండవాలు ప్రాంతాలు సైతం ధ్వంసమయ్యాయి. అలాగే పంచాయతీరాజ్ శాఖ పరిధిలో 153 కిలోమీటర్ల రోడ్లు ధ్వంసం కాగా, రూ.7 కోట్ల 70 లక్షలు నష్టం కలిగింది. మైనర్ ఇరిగేషన్ పరిధిలో 33 సాగునీటి వనరులు ధ్వంసం కాగా, నష్టాన్ని రూ.22.31 లక్షలుగా, మత్స్య పరిశ్రమలకు నష్టం రూ.12.2 లక్షలుగా గుర్తించారు.

### సహాయక చర్యలు భేష్

వరదల సమయంలో కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని పాడేరు, చింతూరు రెవెన్యూ డివిజన్‌ల పరిధిలో ... మిగతా 8వ పేజీలో


సీలేరు-జీకేవీధి మార్గంలో మాతిబంద వద్ద ధ్వంసమైన రహదారి


కొయ్యూరు మండలం రావణాపల్లిలో నీట మునిగిన పొలాలు(ఫైల్)

## జల విద్యుత్ కేంద్రం పరిస్థితిపై ఆరా

### అధికారులతో చర్చించిన ఐటీడీఏ పీవో అభిషేక్

**ముంచంగిపుట్టు:** ఆంధ్రా- ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని, డుడుమ, జోలాపుట్టు జలాశయాలను గురువారం పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ పరిశీలించారు. ఇటీవల జల విద్యుత్ కేంద్రంలోకి వరద నీరు చేరడంతో విద్యుదుత్పాదన నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐటీడీఏ పీవో ప్రస్తుతం జల విద్యుత్ కేంద్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రాజెక్టు సీఈ వాసుదేవరావు, ఎస్ఈలతో కలిసి అధికారులతో చర్చించారు. విద్యుదుత్పాదన పునరుద్ధరణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే డుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో ప్రస్తుతం నీటి నిల్వలు, విడుదల చేస్తున్న నీటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద నీటి ఉధృతికి దెబ్బతిన్న జోలాపుట్టులోని ఆంధ్రా- ఒడిశా సరిహద్దు వంతెనను పరిశీలించారు. అంతకు ముందు ఇటీవల వర్షాలకు మండలంలో పలు ప్రాంతాల్లో దెబ్బతిన్న కల్వర్టులు, వంతెనలు, రహదారులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులో విద్యుదుత్పాదన పునరుద్ధరణకు ప్రాజెక్టు అధికారులు, కార్మికులు శ్రమిస్తున్నారని, వారం రోజుల్లో విద్యుదుత్పత్తి ప్రారంభం అయ్యే అవకాశం ఉందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టులు, వంతెనలు, రహదారుల మరమ్మతు పనులు త్వరగతిన చేపట్టేందుకు తగిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే సరిహద్దు వంతెన పనులను సైతం జరిగే విధంగా చూస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీవో కిరణ్‌కుమార్, తహసీల్దార్ అప్పలస్వామి, ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.


జల విద్యుత్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న పీవో అభిషేక్


ఆంధ్రా- ఒడిశా సరిహద్దులో గల అంతర్ రాష్ట్ర రహదారిలో సగం వరకు కొట్టుకుపోయిన పిల్లిగెడ్డ వంతెన

## కొట్టుకుపోయిన పిల్లిగెడ్డ వంతెన

- ఇరు రాష్ట్రాలకు రాకపోకలు బంద్
- వాగు ఉధృతికి రోడ్ రోలర్, బైకు, రేకుల షెడ్డు గల్లంతు
- కొంత దూరం కొట్టుకుపోయిన ఎక్స్‌కవేటర్
- పోలీసులు డ్రోన్ కెమెరాతో పరిశీలించడంతో విషయం ఆలస్యంగా వెలుగులోకి..


పిల్లిగెడ్డ వాగులో కొట్టుకుపోయిన ఎక్స్‌కవేటర్

**సీలేరు, సెప్టెంబరు 12:** ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో గల అంతర్రాష్ట్ర రహదారిలోని పిల్లిగెడ్డ వంతెన వరద ఉధృతికి కొట్టుకు పోయింది. ఇక్కడికి వెళ్లే మార్గం లేకపోవడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఐదు రోజుల క్రితం భారీ వర్షాలకు పిల్లిగెడ్డ వాగు ఉధృతంగా ప్రవహించడంతో పాత వంతెన సగం కొట్టుకుపోగా, నిర్మాణంలో ఉన్న కొత్త వంతెన అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. అలాగే అక్కడ పనుల కోసం ఉంచిన ఎక్స్‌కవేటర్, రోడ్ రోలర్, బైకు, కూలీల కోసం నిర్మించిన రేకుల షెడ్డు, పనులకు వినియోగించే సెంట్రింగ్ సామగ్రి, ఐరన్, సిమెంట్ బస్తాలు వాగులో కొట్టుకుపోయాయి. కొట్టుకుపోయిన ఎక్స్‌కవేటర్ మాత్రం కొద్ది దూరంలో నీటిలో కనిపిస్తోంది. పిల్లిగెడ్డ పాత వంతెన సగం వరకు కొట్టుకుపోవడంతో ఇరు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గత ఐదు రోజులుగా పిల్లిగెడ్డ వంతెన పరిస్థితిని పరిశీలించేందుకు మార్గం కూడా లేకపోవడంతో ఈ విషయం వెలుగులోకి రాలేదు. అయితే గురువారం సీలేరు పోలీసులు డ్రోన్ కెమెరాతో ఇక్కడి దృశ్యాలను చిత్రీకరించడంతో జరిగిన నష్టం వెలుగులోకి వచ్చింది. వంతెన నష్టాన్ని అంచనా వేయడానికి అధికారులు రావాలన్నా జీకే వీధి- సీలేరు రహదారిలో విరిగిపడిన కొండచరియలు, చెట్లు తొలగింపు పనులు పూర్తి కాలేదు. దీంతో అధికారులు ఎప్పుడు వచ్చి వంతెనను పరిశీలించి అంచనాలు సిద్ధం చేస్తారో అర్థంకాని పరిస్థితి ఉంది.

## చట్రాపల్లి గిరిజనులకు మోడల్ కాలనీ

స్థలం కేటాయించి పక్కా గృహాల నిర్మాణం

- ఇళ్లు కోల్పోయిన వారికి రూ.1.25 లక్షల చొప్పున పరిహారం
- మరో విడత నాట్లుకు అవసరమైన విత్తనాలు పంపిణీ
- కలెక్టర్ దినేశ్‌కుమార్


చట్రాపల్లి గ్రామానికి కొట్టుకు వచ్చిన వరద, కొండచరియలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

**గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 12:** మండలంలోని గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గిరిజనులకు స్థలం కేటాయించి మోడల్ కాలనీ నిర్మిస్తామని కలెక్టర్ దినేశ్‌కుమార్ తెలిపారు. గురువారం చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించిన ఆయన కొండచరియలు విరిగి పడిన తీరు, ధ్వంసమైన గృహాలు, పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఆదివాసీలతో కలెక్టర్ మాట్లాడుతూ చట్రాపల్లి గ్రామంపై కొండచరియలు విరిగి పడి ఒక మహిళ మృతి చెందడం, అదే కుటుంబానికి చెందిన మరో ముగ్గురు గాయపడడంపై చింతిస్తున్నామన్నారు. గాయపడిన గిరిజనులకు మెరుగైన చికిత్స అందిస్తున్నామన్నారు. మృతురాలి కుటుంబానికి రూ.ఐదు లక్షల పరిహారం అందిజేస్తామన్నారు. వరద, కొండచరియలు వల్ల గృహాలను నష్టపోయిన ఏడు కుటుంబాలకు రూ.1.25 లక్షల చొప్పున అందజేస్తామన్నారు. భవిష్యత్తులో కొండచరియల వల్ల ప్రమాదం జరగకుండా 34 కుటుంబాలకు సప్పర్ల సమీపంలో స్థలం కేటాయించి మోడల్ కాలనీ నిర్మిస్తామన్నారు. గ్రామానికి రహదారి నిర్మిస్తామన్నారు. అంగన్‌వాడీ భవనం నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. వరద, కొండచరియల వల్ల ఆదివాసీలు పంటలను నష్టపోవడంతో మరో విడత నాట్లు వేసుకునేందుకు వరి, రాజ్‌మా, ఇతర విత్తనాలను వ్యవసాయశాఖ ద్వారా అందజేస్తామన్నారు. గిరిజనులకు నిత్యావసర సరకులు, వంట పాత్రలు అధికారులు పూర్తి స్థాయిలో అందించారా? లేదా అని ఆరా తీశారు. గిరిజనులకు ప్రభుత్వ పరంగా పూర్తి సహకారం అందజేస్తామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. గిరిజనులు అడవులను సంరక్షించాలన్నారు. అడవుల్లో చెట్లను నరికివేయరాదని, పోడు వ్యవసాయం వల్లనే కొండచరియలు విరిగి పడ్డాయన్నారు. అలాగే సీలేరు-జీకేవీధి రహదారిని పునరుద్ధరిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందరం బాబు, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డీటీ కుమారస్వామి, ఈవోఆర్‌డీ పాపారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ భగవంతరావు, సర్పంచ్ బుజ్జిబాబు, కార్యదర్శి అరుణ్ పాల్గొన్నారు.

## వైరల్ జ్వరాల విజృంభణ

- చింతపల్లి ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి
- అధిక వర్షాలతో గిరిజన గ్రామాల్లో వ్యాధులు
- క్షేత్ర స్థాయిలో నామమాత్రంగా ప్రత్యేక వైద్య శిబిరాలు


చింతపల్లి ఏరియా ఆస్పత్రి ఓపీ వద్ద గురువారం బారులుతీరిన రోగులు

**చింతపల్లి, సెప్టెంబరు 12:** మండలంలో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. అధిక వర్షాలు, వాతావరణంలో కలిగిన మార్పు వల్ల పలు గిరిజన గ్రామాల్లో వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి భారీగా పెరిగింది. రెండు రోజులుగా ఏరియా ఆస్పత్రికి రోగులు అధిక సంఖ్యలో వస్తున్నారు. వార్డులు జ్వర పీడితులతో నిండిపోయాయి.

జిల్లాలో ప్రస్తుతం ఎపిడమిక్ సీజన్ కొనసాగుతున్నది. ఈ సీజన్‌లో గిరిజన గ్రామాల్లో మలేరియా, వైరల్, టైఫాయిడ్, డెంగ్యూతో పాటు అతిసార వ్యాధులు ప్రబలడం సాధారణం. ప్రస్తుతం గిరిజన ప్రాంతంలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో వాతావరణంలో మార్పు వచ్చి గిరిజన గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. గతంతో పోల్చుకుంటే మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు అదుపులో ఉన్నాయని చెప్పాలి. ప్రస్తుతం కలుషిత నీరు, అపారిశుధ్యం, దోమలు వల్ల ఆదివాసీలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటి వరకు స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చిన జ్వర బాధితుల్లో ఇద్దరికి మలేరియా, ఎనిమిది మందికి టైఫాయిడ్ నిర్ధారణ అయింది. అయితే వైరల్ జ్వరాలతో సుమారు 1600 మంది చికిత్స పొందారు. బుధ, గురువారాల్లోనే 300 మంది వైరల్ జ్వరబాధితులు ఆస్పత్రికి వచ్చి చికిత్స పొందారు. ప్రస్తుతం ప్రతి రోజు ఏరియా ఆస్పత్రికి 400 మందికి పైగా రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వార్డుల్లో 40-50మంది రోగులు, గర్భిణులు ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. దీంతో పాటు అతిసార బాధితులు కూడా ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. చింతలూరు గ్రామానికి చెందిన కొర్ర రాము అతిసారతో రెండు రోజుల క్రితం మరణించగా, ప్రస్తుతం ముగ్గురు గిరిజనులు ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. జి.మాడుగుల మండలం వంజరి పంచాయతీ తాడపాలెం గ్రామం నుంచి కొర్ర బంగ్లో అతిసారతో బాధపడుతూ ఏరియా ఆస్పత్రికి వచ్చారు. గ్రామంలో మరి కొంతమంది అతిసారతో బాధపడుతున్నట్టు చెబుతున్నారు.


రోగులతో నిండిన ఏరియా ఆస్పత్రి

### రెండు మండలాలకు పెద్ద దిక్కు

చింతపల్లి, జీకేవీధి మండలాలకు స్థానిక ఏరియా ఆస్పత్రి పెద్ద దిక్కు. రెండు మండలాల్లో 11 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఉన్న ... మిగతా 8వ పేజీలో

## గిరిజన రైతులతో సంఘాలు ఏర్పాటు చేయండి

### కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచన

**పాడేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):** గిరిజన రైతులతో సంఘాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ సూచించారు. నాబార్డు(జాతీయ వ్యవసాయ బ్యాంక్) ఆధ్వర్యంలో రైతు ఉత్పత్తిదారుల గ్రూప్‌లతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో రైతు సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ఆయా సంఘాలకు ప్రభుత్వం నుంచి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని, ఆ సంఘాలు బలోపేతం కావాలన్నారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలిపారు. ప్రకృతి సంపదను పరిరక్షించాలని, గిరిజనుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సహజ సిద్ధమైన చిరుధాన్యాలను సంరక్షించాలన్నారు. రైతులకు ఎరువులు, వ్యవసాయానికి అవసరమైన యంత్ర పరికరాలు, ఉపకరణాలు అందించాలని కలెక్టర్ సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించడంతో ఆదాయం తగ్గిపోతుందని తెలిపారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, మరమ్మతుల బాధ్యత రైతు సంఘాలకు అప్పగిస్తామని, వాటి సమస్యల పరిష్కా రానికి జిల్లా అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ప్రతినెలా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. నాబార్డు జిల్లా అధికారి రాపూరి చక్రధర్ మాట్లాడుతూ జిల్లాలో 50 రైతు ఉత్పత్తిదారుల సంఘాలున్నాయని, వాటికి ప్రోత్సహిస్తామన్నారు. రుణాలు అందించే విధంగా బ్యాంకర్లతో సమన్వయం చేయడం, గ్రాంట్‌లు అందించడం వంటి సహకారం అందిస్తామన్నారు. విత్తన సంపదను కాపాడాలని, విత్తన తయారీ నర్సరీలపై దృష్టి పెట్టాలన్నారు. 'అరకు కాఫీ' బ్రాండ్‌ను వినియోగించుకోవడానికి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కేంద్ర కాఫీ బోర్డులో ఆథరైజ్డ్ యూజర్ సర్టిఫికెట్ పొందాలన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు అవసరమైన శిక్షణ, క్షేత్ర సందర్శనలకు తీసుకు వెళతామన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, స్పైసెస్ బోర్డు సీనియర్ క్షేత్ర అధికారి బి.కల్యాణి, కాఫీ బోర్డు అధికారి పి.దుర్గాభవాని, వ్యవసాయ, ఉద్యానవన మండల స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

## జలాశయాల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

- బలిమెల నుంచి 20,200, గుంటవాడ నుంచి 19 వేలు, డొంకరాయి నుంచి 34,600 క్యూసెక్కుల నీరు దిగువకు..

**సీలేరు, సెప్టెంబరు 12:** సీలేరు కాంప్లెక్సులోని బలిమెల, గుంటవాడ(సీలేరు), డొంకరాయి జలాశయాల నుంచి గురువారం కూడా దిగువకు నీరు విడుదలను కొనసాగిస్తున్నారు. ఇటీవల తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఆంధ్రా- ఒడిశా సరిహద్దుల్లో ఎగువన కురిసిన భారీ వర్షాలకు వరద నీరు అధికంగా వచ్చి చేరి జలాశయాలు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకోవడంతో దిగువకు నీరు విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. సీలేరు కాంప్లెక్సులోని అతి పెద్ద జలాశయం బలిమెల. ఈ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 1,516 అడుగులు కాగా, ప్రస్తుతం 1,512.12 అడుగులకు చేరింది. దీంతో నీరు జాన్‌బాయ్ వంతెనను తాకుతూ ప్రవహిస్తుండడంతో పాటు జలాశయం పరిసర గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశాలున్నందున 20,200 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సీలేరు గుంటవాడ జలాశయంలోకి విడుదల చేస్తున్నారు. బలిమెలలో 1,511 అడుగుల నీటిమట్టానికి ... మిగతా 8వ పేజీలో


డొంకరాయి నుంచి 4 గేట్ల ద్వారా దిగువకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం


గుంటవాడ జలాశయం నుంచి దిగువకు నీరు విడుదల చేస్తున్న దృశ్యం



జోలాపుట్టు వద్ద దెబ్బతిన్న వంతెనను పరిశీలిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, ఎమ్మెల్యే మత్స్యలింగం

## జోలాపుట్టు వంతెన మరమ్మతుకు జిల్లా పరిషత్ నిధులు

- రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని చైర్‌పర్సన్ సుభద్ర వెల్లడి

**ముంచంగిపుట్టు, సెప్టెంబరు 12:** జోలాపుట్టు జలాశయం వరద ఉధృతికి దెబ్బతిన్న ఆంధ్రా, ఒడిశాలను కలిపే జోలాపుట్టు సరిహద్దు వంతెన మరమ్మతు పనులకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయనున్నట్టు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జోలాపుట్టు జలాశయం నుంచి నీటినిఇ విడుదల చేయడంతో దిగువన ఉన్న వంతెన ముందు భాగం దెబ్బతిన్న విషయం తెలిసిందే. దీనిని జడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం గురువారం పరిశీలించారు. వంతెన దెబ్బతి నడంతో అటుఇటు రాకపోకలు సాగించే ఇరురాష్ట్రాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మూడు కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాల్సి వస్తున్నదని స్థానికులు చెప్పారు. దీంతో స్పందించిన ఆమె జడ్పీ నిధులతో తాత్కాలిక మర మ్మతు పనులు చేయిస్తామనని చెప్పారు. వంతెన సమస్యను జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకువెళ్లి పూర్తిస్థాయిలో మరమ్మతులు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం జోలాపుట్టు జలాశయాన్ని సందర్శించారు. రిజర్వాయర్ నుంచి అధికమొత్తంలో నీటిని విడుదల చేసేటప్పుడు పరివాహక ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్‌ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచులు నీలకంఠం, రమేశ్, గంగాధర్, నరసింగ రావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సింహాచలంలో తిరు పవిత్రోత్సవాలు

- రాత్రి ఏడు గంటల వరకే భక్తులకు అప్పన్న దర్శనాలు
- ఈనెల 17 వరకు ఆర్జిత సేవలు రద్దు



ఉత్సవంలో వినియోగించనున్న పవిత్రాలు

**సింహాచలం, సెప్టెంబరు 12:** వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో జరిగే నిత్య, వార, పక్ష, మాస, వార్షిక ఉత్సవాల్లో వైదిక సిబ్బంది లేదా అధికారులు తెలిసో తెలియకో చేసే దోషాల నివృత్తికి శుక్రవారం నుంచి తిరు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ స్థానాచార్యులు రాజగోపాల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏడాది పొడవునా జరిగిన పలు ఉత్సవాల్లో మంత్రం, క్రియ, ద్రవ్యం, భక్తి, శ్రద్ధ విధానాల్లో జరిగిన దోషాల నివృత్తికి ఏటా భాద్రపద మాస శుక్లపక్ష దశమి నుంచి ఐదు రోజులు తిరుపవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈమేరకు దశమి రోజున అంకురార్పణతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టి, పవిత్రాధివాసం, పవిత్ర సమర్పణ, పవిత్ర విసర్జన, ఏకాంత స్నపన తిరుమంజనాలను నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక హోమాలను ఉభయ సంధ్యలను, చతుర్వేద, ఇతిహాస, పురాణాల పారాయణలు నిర్వహించి త్రయోదశి రోజున మహా పూర్ణాహుతి జరుపుతామన్నారు. కాగా ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14 నుంచి 17 వరకు స్వామివారి ఆర్జిత సేవలను రద్దు చేశామని, రాత్రి 7 గంటల వరకే భక్తులకు దర్శనాలు లభిస్తాయని అధికారులు ప్రకటించారు.

## పూర్వ విద్యార్థులకు సత్కారం



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించిన దృశ్యం

**ఎలమంచిలి, సెప్టెంబరు 12:** సీయూఈటీ(పీజీ)లో ప్రతిభ కనబరిచి వివిధ యూనివర్సిటీల్లో చేరిన గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులను ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ గురువారం సత్కరించారు. ఈ కళాశాలలో చదివిన 52 మందిని ఎంపిక చేసి ఏకలవ్య చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో వారికి అవార్డులు, నగదు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపకులు జగ్గారావు, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

## స్కూటీ డిక్కీలో కింగ్‌కోబ్రా.. హతమార్చిన స్థానికులు



హతమైన కింగ్‌కోబ్రా

**అనంతగిరి, సెప్టెంబరు 12:** మండల కేంద్రంలో ఓ ఇంటిముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం(స్కూటీ) డిక్కీలోకి 15 అడుగుల కింగ్‌కోబ్రా పాము దూరింది. దీనిని గమనించిన స్థానికులు కర్రలతో పామును హతమార్చారు. ఇటీవల అనంతగిరి పీహెచ్‌సీ సమీపంలో20 అడుగుల కింగ్‌కోబ్రా కనిపించింది. దీంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

## విశాఖ రైల్వే స్టేషన్‌కు ఎన్ఎస్‌జీ-1 గుర్తింపు

- ప్రతిపాదించిన కేంద్ర రైల్వే బోర్డు
- ఆమోదం లభిస్తే మరిన్ని ఆధునిక వసతులు, సౌకర్యాలు, రైళ్లు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం రైల్వే స్టేషన్‌ను నాన్ సబర్బన్ గ్రూపు (ఎన్ఎస్‌జీ)-1లో చేర్చాలని కేంద్ర రైల్వే బోర్డు తాజాగా ప్రతిపాదించింది. ప్రస్తుతం విశాఖపట్నం స్టేషన్ ఎన్ఎస్‌జీ-2లో ఉంది. ఏడాదికి రూ.500 కోట్లకు పైగా ఆదాయం, రెండు కోట్ల మంది ప్రయాణిస్తే ఆ స్టేషన్‌ను ఎన్ఎస్‌జీ-1లో చేరుస్తారు. విశాఖ రైల్వేస్టేషన్ 2023-24లో గణనీయమైన ప్రగతిని సాధించింది. స్టేషన్ ఆదాయం రూ.5,641.66 కోట్లు కాగా అందులో రిజర్వ్‌డ్ ప్రయాణికుల నుంచే రూ.678.81 కోట్ల ఆదాయం సమకూరింది. ఈ తరహా ఆదాయం చాలా కాలంగా వస్తున్నా ప్రయాణికుల సంఖ్య రెండు కోట్లకు చేరలేదనే కారణంతో ఇప్పటివరకూ దీనిని ఎన్ఎస్‌జీ-2లో కొనసాగిస్తున్నారు. భువనేశ్వర్ కేంద్రంగా పనిచేస్తున్న తూర్పు కోస్తా జోన్‌లో ఎక్కువ ఆదాయం సాధించే స్టేషన్లు 20 వరకు ఉండగా వాటన్నింటిలో విశాఖపట్నమే మొదటి స్థానంలో నిలుస్తోంది. ఈ ఆదాయం ఇంకా పెరిగే అవకాశం ఉండడంతో రైల్వే బోర్డు ఎన్ఎస్‌జీ-1లో చేర్చాలని ప్రతిపాదించింది.

### ఏమిటి ప్రయోజనం?

ఎన్ఎస్‌జీ-2 నుంచి 1కి మారడం వల్ల ఏమిటి ప్రయోజనం అనే ప్రశ్న సాధారణంగా వినిపిస్తుంది. అలా మారిస్తే ఆ స్థాయికి తగినట్టుగా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తారు. అధునాతన వసతులు కల్పిస్తారు. ప్రయాణికులకు ఇంకా మెరుగైన సదుపాయాలు అందుతాయి. వాణిజ్య పరంగా అభివృద్ధి చేస్తారు. డిమాండ్‌కు తగిన రైళ్లను నడుపుతారు. రైల్వే బోర్డు ప్రతిపాదనపై అధికార వర్గాలు హర్షం వ్యక్తంచేస్తున్నాయి.

| చికెన్ ధరలు | |
|---|---|
| బ్యాగ్ | రూ.లలో |
| రైతు ధర | 95.00 |
| లైవ్ ధర | 115.00 |
| విత్ స్కిన్ | 200.00 |
| స్కిన్ లెస్ | 210.00 |

| కోడి గుడ్లు (నెక్) | |
|---|---|
| వంద గుడ్లు | రూ.లలో |
| విశాఖపట్నం | 535 |
| విజయనగరం | 539 |
| శ్రీకాకుళం | 539 |

# సెజ్ ఏర్పాటుతో యువతకు ఉపాధి

- ఎమ్మెల్యే బండారు
- కలెక్టర్‌తో కలిసి ఆర్లి, గుల్లేపల్లి గ్రామాల్లో భూములు పరిశీలన
- సానుకూలంగా స్పందించిన రైతులు



ఎస్ఈజడ్ ఏర్పాటుకు భూసేకరణ జరిపే ప్రాంతం మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు, కలెక్టర్ విజయకృష్ణన్, తదితరులు

**కె.కోటపాడు, సెప్టెంబరు 12:** ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజడ్-సెజ్) ఏర్పాటుతో ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోవడమే కాకుండా పెద్ద ఎత్తున యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని ఆర్లి, గుల్లేపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి పరిశీలించారు. రెవెన్యూ అధికారులు సమర్పించిన భూముల వివరాలపై పరిశ్రమల ఏర్పాటుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉందా? లేదా? అని జిల్లా కలెక్టర్ వాకబు చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎస్ఈజడ్ ఏర్పాటుపై భూముల యజమానుల అభిప్రాయాలను ఆమె కోరగా, హానికారక పరిశ్రమలు తప్ప మిగిలినవి ఏవైనా తమకు అభ్యంతరం లేదని బదులిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ, ఎస్ఈజడ్‌కు అవసరమైన వెయ్యి ఎకరాలు ఇక్కడ అందుబాటులో వున్నాయని, అదనపుంగా భూమి కావాలంటే సేకరించడం జరుగుతుందన్నారు. ఉమ్మడి విశాఖజిల్లాలో అత్యంత వెనుకబడిన ప్రాంతంగా మాడుగుల నియోజకవర్గాన్ని ప్రభుత్వం గుర్తించిందని, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ సహకారంతో ఈ నియోజకవర్గంలో రెండు ఎస్ఈజడ్‌లు ఏర్పాటు అవుతాయని చెప్పారు. ఎస్ఈజడ్‌లో పరిశ్రమల ఏర్పాటుతో రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు సమకూరతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత పైలా ప్రసాదరావు, జనసేన పార్టీ ఇన్‌చార్జి రాయపరెడ్డి కృష్ణ, ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ రమేశ్‌బాబు, ఎంపీడీవో అప్పలరాజు, మండల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



గోతులమయంగా ఉన్న అసకపల్లి - లంకెలపాలెం రోడ్డు

# అధ్వాన రహదారితో అవస్థలు

- అడుగుకో గొయ్యి ఉండడంతో వాహనచోదకుల పాట్లు

**పరవాడ/సబ్బవరం, సెప్టెంబరు 12:** అసకపల్లి - లంకెలపాలెం రోడ్డులో అడుగుకో గొయ్యి ఉండడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల నిర్వహణను గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి నెలకొందని వాహనచోదకులు వాపోతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణమంటే వాహనచోదకులు హడలెత్తిపోతున్నారు. కారుల్లో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయంగా లంకెలపాలెం నుంచి అనకాపల్లి మీదుగా సబ్బవరం చేరుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అసకపల్లి - లంకెలపాలెం రోడ్డును బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

# వీఎంఆర్డీఏ ప్రతిపాదిత రహదారుల పరిశీలన



అచ్యుతాపురంలో పర్యటిస్తున్న కేఎస్ విశ్వనాథన్

**అచ్యుతాపురం, సెప్టెంబరు 12:** వీఎంఆర్డీఏ ప్రతిపాదిత బృహత్ ప్రణాళిక రహదారులను వీఎంఆర్డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ గురువారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వీఎంఆర్డీఏ ప్రతిపాదించిన నాతయ్యపాలెం నుంచి చుక్కవానిపాలెం వరకు వంద అడుగుల రోడ్డు, వీకేపీసీపీఐఆర్, వుడా ప్రతిపాదిత పరవాడ జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ నుంచి అచ్యుతాపురం వరకు 200 అడుగులు, అచ్యుతాపురం- గాజువాక ప్రధాన రహదారిలో గల అప్పన్నపాలెం నుంచి పూడిమడక రోడ్డులో గల సెజ్ ముఖద్వారం వరకు వంద అడుగుల బృహత్ ప్రణాళిక రహదారిని పరిశీలించారు. అచ్యుతాపురం సెజ్‌లో పరిశ్రమల సౌలభ్యం కోసం రద్దీ నియంత్రణలో భాగంగా విస్తరణ చేపట్టవలసిన పలు రహదారులను కూడా ఆయన పరిశీలించారు. అచ్యుతాపురం జంక్షన్ అభివృద్ధి, విస్తరణ పనుల విషయాలను రోడ్లు, భవనాల శాఖ అధికారులతో చర్చించారు. ప్రతిపాదిత రోడ్లకు ఆర్‌డీపీ (రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్)లను, అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ప్రధాన ఇంజనీర్ భవానీ శంకర్, చీఫ్ అర్బన్ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, వీకేపీసీపీఐఆర్- వుడా జాయింట్ డైరెక్టర్ శిల్పా, ప్లానింగ్ అధికారి చైతన్య, డీఈ రవిశంకర్, ఆర్ అండ్ బీ డీఈ విద్యాసాగర్, ఏఈఈ ఆంజనేయరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భూ సేకరణ సర్వేను అడ్డుకున్న రైతులు

- భూములకు ప్రస్తుత ధర ఇవ్వాలని డిమాండ్



దొప్పెర్లలోని దుర్గా దేవి ఆలయంలో సమావేశమైన రైతులు

**అచ్యుతాపురం, సెప్టెంబరు 12:** బాబా అటామిక్ రీసెర్చ్ సెంటర్ (బార్క్) ఉద్యోగుల రెసిడెన్షియల్ కాలనీకి అవసరమైన భూమి సర్వేను దొప్పెర్ల గ్రామస్థులు గురువారం అడ్డుకున్నారు. దీనిపై నిర్వాసిత రైతులంతా దొప్పెర్ల దుర్గాదేవి ఆలయంలో సమావేశమై తమ డిమాండ్లు అంగీకరించిన తర్వాతే సర్వే జరపాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. దీంతో సర్వే చేయడానికి వచ్చిన అధికారులు వెనుదిరిగారు. బార్క్ ఉద్యోగుల నివాసిత కాలనీకి దొప్పెర్ల సర్వే నంబర్లు 99, 159, 164, 165, 168, 169, 170లలో సుమారు 91.33 ఎకరాల భూమిని సేకరించాలని ఏపీఐఐసీ నిర్ణయించింది. ఈ భూముల కోసం ఆగస్టు 2010లోనే నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే అప్పటి నుంచి భూమికి ధర ప్రకటించలేదు, స్వాధీనం చేసుకోలేదు. రైతులు ఇంతవరకు సాగుచేసుకుంటున్నారు. ఈ భూమిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని అధికారులు సర్వే ప్రారంభించారు. ఈ మేరకు గత ఆరు నెలల నుంచి సర్వే అధికారులు వస్తున్నారు, రైతులు అడ్డుకుంటున్నారు. అదే విధంగా గురువారం కూడా సర్వే అధికారులు వచ్చారు. మళ్లీ రైతులు అడ్డుకున్నారు. ఈ భూములకు 2010లో నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ ఇప్పటి ధరల ప్రకారం పరిహారం ఇవ్వాలని, నిర్వాసితులకు తప్పనిసరిగా బార్క్‌లో ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ముందుగా తమ డిమాండ్లు అంగీకరించిన తరువాతే సర్వేకి రావాలని రైతులు కోరారు. దీనిపై సర్వే అధికారిణి జె.రాధకు వినతి పత్రం ఇచ్చారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని ఆమె రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొరుప్రోలు చిన్నారావు, ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు పల్లి శేషగిరిరావు, కొల్లి వరహాల రావు, పల్లి సత్యారావు, లాలం లావణ్య, కొరుప్రోలు శ్రీనివాసరావు, వర్రె అప్పారావు, కొల్లి రామారావు, బి. బాపు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎం నేత సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12:** సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి మృతికి ఆ పార్టీ నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీపీఎం కార్యాలయంలో మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, జిల్లా కార్యదర్శివర్గసభ్యుడు జి.కోటేశ్వరరావులు గురువారం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, ఉమామహేశ్వరరావు, సుజాత, సుభాషిణి పాల్గొన్నారు.

# సీపీ X డీఐజీ

- సీఐల బదిలీ ప్రక్రియపై భేదాభిప్రాయాలు
- నగర పోలీస్ కమిషనర్ పీఈబీ ఆమోదం తీసుకోలేదని వాదన
- నగరంలో పోస్టింగ్ వచ్చినా చేరని కొంతమంది సీఐలు
- ఆయా జిల్లాల్లో రిలీవ్ చేయకపోవడమే కారణం
- డీఐజీ అనుమతించలేదని ప్రచారం

విశాఖపట్నం, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

**నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చికి, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టికి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందనే చర్చ పోలీస్ వర్గాల్లో సాగుతోంది. ఇరువురు అధికారుల మధ్య ఏర్పడిన విభేదాలు ఇటీవల నగర పరిధిలో సీపీ చేపట్టిన సీఐల బదిలీల అనంతరం తారస్థాయికి చేరినట్టు ప్రచారం జరుగుతోంది.**

ఇటీవల సీపీ శంఖబ్రత బాగ్చి మూడు విడతల్లో 52 మంది సీఐలను బదిలీ చేయడం/పోస్టింగ్ ఇవ్వడం చేశారు. ఆ సమయంలో సీపీ నిబంధనలకు విరుద్ధంగా రేంజ్ పరిధిలోని సీఐలకు నగరంలో పోస్టింగ్‌లు ఇచ్చారని డీఐజీ అభ్యంతరం వ్యక్తంచేసినట్టు తెలిసింది. సాధారణంగా విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల అపాయింట్‌మెంట్ అథారిటీగా డీఐజీ వ్యవహరిస్తారు. ఎస్ఐలను జిల్లాలకు కేటాయించిన తర్వాత వారికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది సంబంధిత జిల్లా ఎస్పీ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. అదే మాదిరిగా సీఐల బదిలీ నగర పోలీస్ కమిషనరేట్ మినహా విశాఖ రేంజ్ పరిధిలో డీఐజీ విచక్షణపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ రేంజ్ పరిధిలో పనిచేస్తున్న సీఐలను నగర పోలీస్ కమిషనరేట్‌కు తీసుకోవాలని సీపీ భావిస్తే పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు (పీఈబీ) ఆమోదం తప్పనిసరి. నగరానికి ఎవరెవరిని తీసుకోవాలనుకుంటున్నారనే జాబితాను సీపీ...రేంజ్ డీఐజీకి పంపిస్తే ఆయన వారిని రేంజ్ నుంచి సిటీ వీఆర్‌కు బదిలీ చేస్తారు. సిటీ వీఆర్‌కు వచ్చిన తర్వాత ఎక్కడ ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలనేదానిపై సీపీకి మాత్రమే విచక్షణాధికారం ఉంటుంది. అలాగే సిటీ నుంచి రేంజ్‌కు బదిలీ చేయాలనుకుంటే సీపీ వారిని వీఆర్‌కు మాత్రమే సరండర్ చేయాలి. అక్కడ నుంచి డీఐజీ వారి సేవలను ఎక్కడెక్కడ వాడుకోవాలనేది నిర్ణయించుకుంటారు. ఇదిలావుంటే నగర పరిధిలో జరిగిన గత మూడు దశల సీఐల బదిలీలు/పోస్టింగ్‌ల ప్రక్రియలో మొదటి రెండు దశలకు సంబంధించి సీపీ సీఐలను బదిలీ చేసినప్పుడు పీఈబీ ఆమోదం తీసుకోలేదని పోలీస్ అధికారులు కొందరు చెబుతున్నారు. రేంజ్ పరిధిలో పనిచేస్తున్న వారిలో నిజాయితీపరులు, సమర్థులుగా గుర్తింపు ఉన్న సీఐలను సీపీ నగరానికి తీసుకున్నారు. ఈ క్రమంలో కొందరు ప్రజా ప్రతినిధులను సిఫారసులను సైతం సీపీ పక్కనపెట్టారంటూ రాజకీయ వర్గాల్లో దుమారం రేగింది. నగరంలో పోలీసింగ్‌ను బలోపేతం చేయడమే తన లక్ష్యమని, మరో ఆలోచనకు తావు ఉండకూడదనే పారదర్శకంగా బదిలీలు చేపట్టానంటూ సీపీ కొందరు అధికారుల వద్ద అభిప్రాయపడినట్టు తెలిసింది. ఇదిలావుండగా రేంజ్‌లో పనిచేస్తూ సిటీకి బదిలీ అయిన సీఐలు కొందరు ఇప్పటికీ తమ కొత్త పోస్టింగ్‌లలో చేరలేదు. ఇప్పుడు పనిచేస్తున్న స్థానం నుంచి వారిని డీఐజీ రిలీవ్ చేయడానికి నిరాకరించడమే దీనికి కారణమంటూ ప్రచారం జరుగుతోంది. సీఐల బదిలీల అంశం ఇప్పటికే డీజీపీ ద్వారకా తిరుమలరావు దృష్టికి చేరినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా సీపీ, డీఐజీల మధ్య తలెత్తిన విభేదాలు తమకు సమస్యగా పరిణమించాయంటూ నగర పరిధిలో పోస్టింగ్‌లు దక్కించుకున్న సీఐలు వాపోతున్నారు.

## రేపటి నుంచి సీపీఎం బైక్ యాత్ర



పోస్టర్లను ఆవిష్కరించిన సీపీఎం నాయకులు

**అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12:** జిల్లాలోని వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు సీపీఎం ఆధ్వ ర్యంలో బైక్ యాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం బైక్‌యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ 14న పాయకరావుపేట నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. జిల్లాలో గత 25 ఏళ్లుగా జరిగిన పారిశ్రామిక ప్రమాదాల్లో ఎసెన్షియా ఫార్మాలో జరిగిన ప్రమాదం అతి పెద్దదని తెలిపారు. కంపెనీ నిర్లక్ష్యం వల్ల 17 మంది కార్మికులు మృతి చెందారన్నారు. రాష్ట్రంలో ఇటీవల వివిధ పరిశ్రమల్లో 120 ప్రమాదాలు జరిగి 140 మంది మృతి చెందగా, అనకాపల్లి జిల్లాలోనే ఆరేళ్లలో 54 కంపెనీల్లో జరిగిన ప్రమాదాల్లో 62 మంది మృతి చెందగా, 92 మంది తీవ్ర గాయాలపాలయ్యారన్నారు. పరిశ్రమల్లో కార్మికుల భద్రత, ప్రభుత్వాల పటిష్ఠ చర్యలకు సీపీఎం నిర్వహిస్తున్న యాత్రలో కార్మికులు, ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, గంటా శ్రీరామ్, అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు.

## అవగాహనతో ఎయిడ్స్ నివారణ సాధ్యం



బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ విజయకృష్ణన్

**అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 12:** సంపూర్ణ అవగాహనతో ఎయిడ్స్ నివారణ సాధ్యమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాప్తిని తగ్గించడానికి, ఆరోగ్యకరమైన ఎంపికలను ప్రోత్సహించడానికి ఐఈసీ ప్రచారం -2024 పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ బాలాజీ, డాక్టర్ స్పందన, రామచంద్ర, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలి

- స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం



స్పీకర్ అయ్యన్నపాత్రుడుకి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు

**నర్సీపట్నం, సెప్టెంబరు 12:** సచివాలయాల ఏఎన్ఎంలకు ఇంటెన్సిఫైడ్ జీఎన్ఎం పేరుతో 18 నెలలపాటు శిక్షణ ఇచ్చి పర్మనెంట్ స్టాఫ్ నర్సులుగా నియామకాలు చేయపట్టడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు పేర్కొన్నారు. గురువారం ప్రాంతీయ ఆస్పత్రి వద్ద ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు నివాసానికి, సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు మాట్లాడుతూ, జీవో 115 వల్ల ప్రభుత్వ ఆస్పత్రుల్లో 15 సంవత్సరాలుగా కాంట్రాక్టు విధానంలో స్టాఫ్ నర్సులుగా చేస్తున్న తమకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. తక్షణమే జీవోను రద్దు చేయాలని, తమను రెగ్యులర్ చేయాలని కోరారు. దీంతో స్పందించిన అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబుతో మాట్లాడారు. అమరావతి వెళ్లి కృష్ణబాబుని కలవాలని కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల యూనియన్ నాయకులకు ఆయన సూచించారు.

## మహిళ గల్లంతుపై సీఐ విచారణ



గల్లంతైన మహిళ కుటుంబీకులను విచారిస్తున్న సీఐ కోటేశ్వరరావు.

**బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 12:** వడ్డాది వద్ద పెద్దేరు నదిలో మహిళ గల్లంతు అయిన సంఘటనపై కొత్తకోట సీఐ కోటేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. మంగళవారం రాత్రి కస్పా కాలువ గట్టుపై తన సోదరి బద్దీ విజయలక్ష్మితో కలసి బహిర్భూమికి వెళ్లిన జనపరెడ్డి సుబ్బలక్ష్మి ప్రమాదశాత్తూ కాలు జారి పెద్దేరులో పడి గలంతైన విషయం విదితమే. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ కోటేశ్వరరావు గురువారం ఇక్కడకు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. విజయలక్ష్మిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మరం చేస్తామని సీఐ తెలిపారు. కాగా పెద్దేరులో గల్లంతైన సుబ్బలక్ష్మి చీరను వడ్డాది సంతబయలు దిగువ ప్రాంతంలోని తుప్పల్లో కనుగొన్నారు. సుబ్బలక్ష్మి ఆచూకీ కోసం ఈతగాళ్లు రెండు రోజుల నుంచి పెద్దేరు నదిలో వడ్డాది నుంచి గౌరీపట్నం వరకు గాలిస్తున్నారు. గురువారం సాయంత్రం వరకు ఫలితం లేకపోయింది.

## రోడ్ల మరమ్మతుకు టెండర్లు: ఏపీఐఐసీ జడ్‌ఎం

**అచ్యుతాపురం, సెప్టెంబరు 12:** సెజ్ పరిధిలో రోడ్ల మరమ్మతుకు టెండర్లు ఆహ్వానించామని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె.హరిప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'భారీ వర్షాలతో రోడ్లు ఛిద్రం' శీర్షికతో ఈనెల 11న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. ఏపీఐఐసీ పరిధిలోగల రోడ్ల మరమ్మతులపై ఇటీవల ఐలాలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశంలో చర్చించామన్నారు. గోతులను గత జూలైలో వెట్ మిక్స్ మెకడమ్‌తో పూడ్చామన్నారు. రోడ్ల మరమ్మతులు, నిర్వహణ పనులు ఈ-ప్రొక్యూర్‌మెంట్ విధానం ద్వారా జరుగుతుందన్నారు. ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల ఐదున టెండర్లు పిలిచారని, ఎస్ఈజడ్‌లోని రోడ్లకు రూ.2.95 కోట్లు, డీనోటిఫైడ్ రోడ్లకు రూ.4.9 కోట్లు ఐలాలో డిపాజిట్ చేశామని, 29న టెండర్లు తెరుస్తామన్నారు.

# జాతీయ రహదారి విస్తరణపై సర్వే



సర్వే నిర్వహిస్తున్న రెవెన్యూ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు

**అనంతగిరి, సెప్టెంబరు 12 :** మండల కేంద్రంలో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించి రెవెన్యూ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు గురువారం సర్వే చేపట్టారు. ప్రస్తుతం రెవెన్యూ భూములకు సంబంధించి సర్వే నిర్వహించగా.. ఎంతవరకు మేరకు భవనాలు, నివాస గృహాలు, వ్యాపార సముదాయాలు ఉన్నాయనే దానిపై పరిశీలించి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్టు వారు తెలిపారు. ఆర్ అండ్‌బీ శాఖకు సంబంధించిన సరిహద్దులను పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గంగరాజు, ఆర్‌ఐ రామ్మూర్తి, సర్వేయర్ భాస్కర్, టీడీపీ యువ నాయకుడు ఎం.రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## చట్రాపల్లి నిర్వాసితుల కోసం ప్రత్యేక కార్యాచరణ

**టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి**



చట్రాపల్లి చిన్నారులు, గిరిజనులకు దుస్తులు అందజేస్తున్న గిడ్డి ఈశ్వరి

**గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 12 :** కొండచరియలు విరిగిపడి సర్వస్వం కోల్పోయిన చట్రాపల్లి నిర్వాసితులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిందని టీడీపీ పాడేరు నియోజకవర్గం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి పేర్కొన్నారు. గురువారం ఎన్డీయే కూటమి నాయకులతో సప్పర్ల పునరావాస కేంద్రానికి వచ్చిన ఆమె 37 కుటుంబాలకు చెందిన పిల్లలు, మహిళలు, వృద్ధులు, పురుషులకు అవసరమైన దుస్తులు మూడు, నాలుగు జతలు చొప్పున పంపిణీ చేశారు. అనంతరం ఈశ్వరి మాట్లాడుతూ చట్రాపల్లిలో ఆదివారం అర్ధరాత్రి కొండచరియలు, వరదల కారణంగా మహిళ మృతి చెందడం, మరో ముగ్గురు గాయపడడం బాధకరమన్నారు. గాయపడిన క్షతగాత్రులకు ప్రభుత్వం మెరుగైన చికిత్స అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత బొర్ర విజయరాణి, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గంటా నళిని, గాలికొండ సర్పంచ్ కాకూరి బుజ్జిబాబు, ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బొజ్జిబాబు, జీకేవీధి మాజీ సర్పంచ్ పసుపులేటి రామకృష్ణ, చింతపల్లి టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, పండా రామకృష్ణ, పసుపులేటి నాగమణి, కేశ్వరరావు పాల్గొన్నారు.

## మోదమాంబ హైస్కూలు విద్యార్థుల ఔదార్యం

**విజయవాడ వరద బాధికులకు రూ.లక్ష విరాళం**



కలెక్టర్‌కు విరాళం అందజేస్తున్న మోదమాంబ స్కూలు టీచర్లు, విద్యార్థులు

**పాడేరు రూరల్, సెప్టెంబరు 12 :** విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు స్థానిక మోదమాంబ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముందుకు వచ్చారు. మొత్తం రూ.లక్షల విరాళాన్ని సీఎంఆర్‌ఎఫ్‌కు అందించారు. ఈ క్రమంలో వీరు గురువారం ఇందుకు సంబంధించిన చెక్‌ను కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌కు అందజేశారు. సహాయ నిధిని అందించి సేవా భావం చూపిన హైస్కూల్ యాజమాన్యం, విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా వినాయక నిమజ్జనాలు



ముగ్గుల పోటీలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

**పాడేరు రూరల్, సెప్టెంబరు 12 :** స్థానికంగా వినాయక నిమజ్జనాలను గురువారం పెద్ద ఎత్తున నిర్వహించారు. పాతపాడేరు శివదుర్గ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక ఊరేగింపులో స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు పాల్గొన్నారు. వినాయక ఉత్సవాల సందర్భంగా మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలుగానిలిచిన మహిళలకు ఆయన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా గ్యాస్ స్టవ్, సీలింగ్ ఫ్యాన్, కుక్కర్‌లను బహుమతిగా అందించారు. పట్టణంలోని గుడివాడ, బక్కులపనుకు, గుడివాడ గడ్డికాలనీ తదితర ప్రాంతాల వినాయక ఊరేగింపు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను ఆకర్షించాయి.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుల్ని సన్మానిస్తున్న జడ్పీటీసీ గంగరాజు తదితరులు

**అనంతగిరి, సెప్టెంబరు 12 :** ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందుకున్న మండలానికి చెందిన వీవీ ఈశ్వరరావు, కె.అప్పలరాజు (పీడీ), పీ.మహాదేవ్, ఎస్.మల్లేశ్వరరావులను గురువారం జడ్పీటీసీ దీసరి గంగరాజు సత్కరించారు. ఈ ఉపాధ్యాయులను గురుపూజోత్సవం సందర్భంగా ఈ నలుగురు ఉపాధ్యాయులు.. జిల్లా కలెక్టర్ దీనేష్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్ చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయులకు జడ్పీటీసీ గంగరాజు, ఎంఈవో కిల్లో బాలాజీ, ఏటీడబ్ల్యూ కూడ వెంకటరమణ చేతులు మీదుగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పి.ప్రసాదరావు, సీనియర్ ఉపాధ్యాయులు సోమర, రాంబాబు, దేముడు, భాస్కరరావు, నాయకులు నాగులు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాం ఏచూరి మృతిపై సంతాపం

**అనంతగిరి, సెప్టెంబరు 12 :** సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపై మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయం వద్ద నాయకులు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గంగరాజు, నాయకులు నాగులు, ఉపసర్పంచ్ అర్జున్, తదితరులు పాల్గొని సంతాపం వ్యక్తపరిచారు.

# సప్పర్ల ఆశ్రమ పాఠశాల టీచర్లపై కలెక్టర్ అసహనం

- 8వ తరగతి విద్యార్థులు తెలుగు చదవలేకపోవడంపై అసంతృప్తి
- మీరేం బోధిస్తున్నారంటూ నిలదీత
- తీరు మారాలంటూ ఆగ్రహం

**గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 12 :** ఎనిమిదో తరగతి విద్యార్థికి తెలుగు చదవడం రాకపోతే ఎలా? ఉపాధ్యాయులు ఏం బోధిస్తున్నారు? అంటూ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. గురువారం చట్రాపల్లి గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్ తిరుగు ప్రయాణంలో రాత్రి సప్పర్ల గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్లంలో చదివించారు. ఒక్క విద్యార్థి కూడా తెలుగులో స్పష్టంగా చదవలేదు. ఆంగ్లం పదాలను గుర్తుపట్ట లేదు. దీంతో కలెక్టర్ ఉపాధ్యాయులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అసలు మీరేం బోధిస్తున్నట్టు? అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లం పాఠ్యాంశాల్లో పూర్తి పట్టు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. మరోసారి పాఠశాలను సందర్శిస్తానని, విద్యార్థుల పరిస్థితి ఇదే విధంగా ఉంటే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు.



విద్యార్థిని తెలుగు పాఠ్య పుస్తకం చదివిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

# బాలింతకు తప్పని రవాణా ఇబ్బందులు

- వంతెన పై నుంచి నీరు ప్రవహిస్తుండడంతో దాట లేని పరిస్థితి
- ఏఎన్‌ఎం సమయస్ఫూర్తితో ఎక్సకవేటర్‌పై దాటి ఆస్పత్రికి చేరిన వైనం

**కొయ్యూరు, సెప్టెంబరు 12 :** అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు రహదారులు, వంతెనలు పాడవడంతో పచ్చి పురటాలను వైద్య సేవలకు తరలించేందుకు రవాణా కష్టాలు తప్పని పరిస్థితులునెలకొన్నాయి. మండలంలో బట్టపణుకు గ్రామానికి చెందిన బాలింత చదల రాజేశ్వరి గురువారం అస్వస్థత కు గురైంది. దీంతో ఏఎన్‌ఎం చెల్లయ్యమ్మ తల్లీబిడ్డను కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించేందుకు బట్టపణుకుల నుంచి రామరాజుపాలెం వరకు ఆటోలో తీసుకువచ్చింది. అయితే రామరాజుపాలెం వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక వంతెన పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో దాన్ని దాటించటం సమస్యగా మారింది. దీంతో ఏఎన్‌ఎం సమయస్ఫూర్తితో వ్యవహరించి అక్కడే వంతెన పునర్నిర్మాణ పనులు చేస్తున్న ఎక్స్‌వేటర్ డ్రైవర్‌కు విషయాన్ని తెలిపి బకెట్ సాయంతో వాగు దాటించాలని కోరింది. దీంతో ఎక్సకవేటర్ బకెట్‌లో తల్లీబిడ్డను ఉంచి వరద నీటిని దాటించి ఒడ్డుకు చేర్చారు. అక్కడ నుంచి వేరొక వాహనంపై పీహెచ్‌సీకి తరలించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం సమయస్ఫూర్తిని పలువురు అభినందించారు.



ఎక్సకవేటర్ సహాయంలో వాగును దాటిస్తున్న దృశ్యం

## పరిపాలనాపరమైన బదిలీ మాత్రమే

- గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ కొండలరావు స్థానచలనంపై కలెక్టర్ స్పందన

**పాడేరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :** ప్రభుత్వపరంగా పరిపాలనాపరమైన బదిలీల్లో భాగంగానే గిరిజన సంక్షేమ విద్యాశాఖ ఉప సంచాలకుడు కొండలరావు బదిలీ జరిగిందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ పేర్కొన్నారు. టీడబ్ల్యూ డీడీ ఆకస్మిక బదిలీ నేపథ్యంలో 'కూటమి సర్కారులో వైసీపీ నేతల హవా' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఎవరి సిఫార్సులతో సంబంధం లేకుండానే కేవలం 'పరిపాలనాపరమైన బదిలీ'ని మాత్రమే చేశామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ విద్యాశాఖపై పలుమార్లు జరిపిన సమీక్షలు, విచారణల నేపథ్యంలోనే ఈ బదిలీ జరిగిందన్నారు. ఆయన్ని బదిలీ చేయమని తమకు ఎటువంటి సిఫార్సు లేక అందలేదని కలెక్టర్ పేర్కొన్నారు.

## మరుగుదొడ్ల ఫొటో తీసే పనులు తగదు : సచివాలయ సిబ్బంది



ఎంపీడీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సచివాలయం విద్య, సంక్షేమ సహాయకులు

**ముంచంగిపుట్టు, సెప్టెంబరు 12 :** పాఠశాలల మరుగుదొడ్ల ఫొటో తీసే ఉత్తర్వులను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని కోరుతూ సచివాలయం విద్య, సంక్షేమ సహాయకులు గురువారం స్థానిక ఎంపీడీవో కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల శుభ్రత తనిఖీలు, ఫొటో తీసే బాధ్యతలు అప్పగించడం, ప్రతీ సోమ, గురు వారాల్లో మరుగుదొడ్ల ఫొటోలు అప్లోడ్ చేయాలని తమకు ఆదేశాలు జారీ చేయడం సరికాదన్నారు. అటువంటి పనులు చేయడం వలన ఇబ్బందికరంగా ఉంటుందని వారు వాపోయారు. తక్షణమే ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని వారు కోరారు.

# బాలిక మృతదేహానికి స్వగ్రామంలోనే పోస్టుమార్టం

- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికార యంత్రాంగం
- వాగులు దాటి గోదుమలంకకు..



గెడ్డ దాటుతున్న ఎంపీడీవో మేరీరోస్



కుటుంబీకుల నుంచి వివరాలు సేకరిస్తున్న అధికారులు

**కొయ్యూరు, సెప్టెంబరు 12 :** ఆడుకునేందుకు వెళ్లి కొండవాగు ప్రవాహంలో కొట్టుకుపోయి మృత్యువాత పడిన బూదరాళ్ల పంచాయతీ గోదుమలంకకు చెందిన పాంగి హిందూ(7) మృతదేహానికి కలెక్టర్ చొరవతో మండల అధికారులు, వైద్య బృందం గురువారం గ్రామానికి వెళ్లి పోస్టుమార్టం నిర్వహించారు. గోదుమలంకకు చెందిన బధిర బాలిక హిందూ (7) ఆడుకునేందుకు వెళ్లి మంగళవారం కొండవాగు ప్రవాహంలో గల్లంతై బుధవారం శవమై తేలిన విషయం తెలసిందే. ఈ సమాచారాన్ని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఈ ఘటనపై పూర్తి వివరాలు సేకరించి నివేదికు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు అలాగే మృతి చెందిన బాలికకు గ్రామంలోనే పోస్టుమార్టం నిర్వహించేలా చింతపల్లి ఏరియా ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు. దీంతో పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో పాటు వైద్య నిపుణులు గురువారం ఉదయం అత్యంత మారుమూల గ్రామమైన గోదుమలంకకు వెళ్లి ఘటనపై విచారించి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. బధిర బాలిక హిందూ మరణంపై తల్లితండ్రులు సన్యాసిరావు, కాసులి, కుటుంబీకులు, గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించి నివేదికలు తయారు చేశారు.కాగా, కొయ్యూరు పోలీసులు పోస్టుమార్టం చేయించేందుకు చింతపల్లి వైద్యుడు రమేశ్‌ని పిలిచారు. దీంతో గురువారం జీపులో ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో జీపు ఆగిపోయింది. దీంతో సుమారు నాలుగు కిలోమీటర్లు వాగులు, వంకలు దాటుకుని గోదుమలంక వెళ్లి పోస్టుమార్టం చేశారు. గోదుమలంకకు వెళ్లిన వారిలో ఎంపీడీవో మేరీరోస్, ఇన్‌చార్జ్ తహసీల్దారు సీతారాం, ఆర్‌ఐ రాజన్నదొర, మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్, సిబ్బంది, వీఆర్‌వో పండయ్య, గంగాధర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## కొందరు అధికారుల తీరు సరికాదు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

**అనంతగిరి, సెప్టెంబరు 12 :** రాష్ట్రంలోని ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందనే భావన కొందరు అధికారుల్లో కనిపిస్తోందని, ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని టీడీపీ కార్యవర్గ సభ్యులు మోస్య జోగులు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ కొందరు అధికారులు ప్రభుత్వ కార్యక్రమాలకు కనీసం టీడీపీ మండల నాయకులకు సమాచారం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇతర పార్టీలకు చెందిన నాయకులు మాత్రమే మీకు కనిపిస్తున్నారా అంటూ మండిపడ్డారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి టీ.ఆనందరావు, కె.కృష్ణ, డి.దొన్ను, జి.దేముడు, కాలరాజు, చందరరావు తదితరులు పాల్గొన్నారు.

# చింతలూరు అతిసార బాధితులకు పరామర్శ

**చింతపల్లి, సెప్టెంబరు 12 :** మండలంలోని చింతలూరు అతిసార బాధితులకు మెరుగైన చికిత్స అందించడంలో కొలుకుంటున్నారని టీడీపీ అరకు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి అన్నారు. గురువారం ఏరియా ఆస్పత్రిలో చింతలూరు అతిసార బాధితులను పరామర్శించి పండ్లు, రొట్టెలు అందజేశారు. రోగుల పరిస్థితిని మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతిని అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు దేపూరి వెంగళయ్య, శాంతారావు, కోటేశ్వరరావు, సునీల్ పాల్గొన్నారు.



రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న జ్ఞానేశ్వరి

## రాయితీపై రాజ్మా విత్తనాల పంపిణీ



నుర్మతి సచివాలయంలో రాజ్మాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు

**జి.మాడుగుల, సెప్టెంబరు 12 :** రాయితీపై అందిస్తున్న రాజ్మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి పాత్రుడు అన్నారు. మండలంలోని నుర్మతి, బీరం పంచాయతీలలో శుక్రవారం రైతులకు 90 శాతం రాయితీతో రాజ్మా విత్తనాలను పంపిణీ చేశారు. ఆరుతడి భూముల్లో ఈ విత్తనాలు నాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు మృతి చెందిన పశువులకు పరిహారం

- తొలి విడతలో రూ.11.03 లక్షలకు ప్రతిపాదనలు
- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి నరసింహులు

**చింతపల్లి, సెప్టెంబరు 12 :** భారీ వర్షాలకు పశువులు మృతి చెందిన నేపథ్యంలో వాటి యజమానులకు పరిహారం చెల్లించే క్రమంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నరసింహులు తెలిపారు. గురువారం స్థానిక ప్రాంతీయ పశువుల స్పత్రిలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి పశువైద్యులు, క్షేత్ర స్థాయి ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్షేత్ర స్థాయి ఉద్యోగులకు పశుగణన కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో కురిసిన అధిక వర్షాలకు ఇప్పటి వరకు 20 పశువులు, 97 మేకలు, గొర్రెలు, 150 కోళ్లు మృత్యువాత పడ్డాయని తెలిపారు. ఈపశువులకు తొలి విడతగా రూ.11.03 లక్షల నిధులు అవసరమని ప్రభుత్వానికి నివేదిక పంపించామన్నారు. 21వ పశుగణన చేపట్టనున్నట్టు తెలిపారు. పొలంబడి కార్యక్రమంలో కచ్చితంగా పశువైద్య సిబ్బంది హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో సాధనిక అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖర్, మూడు మండలాల పశువైద్యాధికారులు పాల్గొన్నారు.



క్షేత్ర స్థాయి ఉద్యోగులకు పశుగణన కిట్లు అందజేస్తున్న డాక్టర్ నరసింహులు

# వైరల్ జ్వరాల విజృంభణ


... 5వ పేజీ తరువాయి

రోగులు చికిత్స కోసం చింతపల్లి ఏరియా ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రిగా స్థాయి పెంచినప్పటికి తగినన్ని సదుపాయాలు అందుబాటులో లేవు. నూతన భవనాల నిర్మాణాలు పూర్తికాలేదు. దీంతో సుమారు 20 ఏళ్ల కిందట ఆస్పత్రి అవసరాల కోసం నిర్మించిన భవనంలోనే సర్దుకుంటూ వైద్యులు రోగులకు చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో కేవలం 40 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో రోగుల తాకిడి పెరిగిన సమయంలో ఒకే బెడ్‌పై ఇద్దరిని పడుకోబెట్టి చికిత్స అందించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది. ప్రస్తుతం ఆస్పత్రిలోని వార్డు రోగులతో నిండిపోయింది.

**గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు అంతంతమాత్రమే..**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించిన దాఖలాలు లేవు. గత వైసీపీ ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అమలులోకి తీసుకొచ్చి ప్రత్యేక వైద్య శిబిరాలను పక్కన పెట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఉన్నా వైద్య ఆరోగ్యశాఖలో మార్పు రాలేదు. ఇప్పటికీ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వారానికి ఒకటి, రెండు రోజులు పీహెచ్‌సీ వైద్యాధికారి ఒకటి, రెండు గ్రామాలను సందర్శించి ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. మిగిలిన రోజుల్లో గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి స్పందించి గిరిజన గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

**రోగులకు మెరుగైన వైద్యం**



ఏరియా ఆస్పత్రిలో రోగులకు మెరుగైన చికిత్స అందిస్తున్నాం. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలు అదుపులో ఉన్నాయి. అత్యధిక సంఖ్యలో వైరల్ జ్వరాలతో చికిత్సకు వస్తున్నారు. రోగులకు ఆస్పత్రిలోనే రక్త పరీక్షలు చేస్తున్నాం. అతిసార బాధితులకు సకాలంలో చికిత్స అందిస్తున్నాం. వ్యాధి వచ్చిన వెంటనే బాధితులను ఆస్పత్రికి తీసుకొస్తే చికిత్స సులభంగా ఉంటుంది, ప్రాణాపాయం తప్పుతుంది.

**- డాక్టర్ జి.ప్రభావతి, సూపరింటెండెంట్, చింతపల్లి ఏరియా ఆస్పత్రి**

## సంక్షిప్తంగా..

### కానిస్టేబుల్ ఉద్యోగార్థులకు ఉచిత శిక్షణ

**డుంబ్రిగుడ, సెపెంబరు 12 :** స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్సెస్సీ) వివిధ శాఖల్లో కానిస్టేబుళ్ల నియామకానికి నోటిఫికేషన్ వెలువరించిన నేపథ్యంలో నిరుద్యోగుల సౌలభ్యం కోసం ఉచిత శిక్షణ అందించనున్నట్టు స్థానిక ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. పదో తరగతి అర్హతతో నిర్వహించే ఉద్యోగాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 14 వరకు గడువు ఉందని చెప్పారు. అభ్యర్థులకు పోలీసు శాఖ స్ఫూర్తి కార్యక్రమంతో పాటు ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణతో పాటు వసతి భోజన సదుపాయాన్ని కల్పిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని గిరిజన యువతీయువకులు సద్వినియోగపరచుకోవాలని ఆయన కోరారు. కానిస్టేబుళ్ల పోస్టులకు దరఖాస్తులు సమర్పించిన అభ్యర్థులు ఉచిత శిక్షణ కోసం స్థానిక పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

### బాధితుడికి ఆర్థిక సహాయం

**పాడేరు రూరల్, సెప్టెంబరు 12 :** ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన అల్లూరి జిల్లా పాడేరు డివిజన్ శ్రీమోద ఉమానీలకంఠేశ్వర ఎలక్ట్రీషియన్ అండ్ ప్లంబర్ అసోషియేషన్ సభ్యుడు జర్సింగి కృష్ణారావుకు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు కొట్టగుళ్లి రామారావు చేతుల మీదుగా రూ. 8,900 నగదును ఆర్థిక సహాయంగా అందించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి బాధితుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు ఎస్.దామోదరం, ఎం.స్వామినాయుడు, పి.బబ్లూ, ఎస్.రవిప్రసాద్, బి.ప్రకాశరావు, కె.సత్యారావు, ఎస్.త్రినాథరావు, బి.కొండబాబు, ఎం.రాంబాబు, ఎల్.గిరిపాత్రుడు, ఓ.సతీష్, బి.చింటిబాబు, బి.బాలరాజు, టి.శంకరరావు, ఎల్.పాత్రుడు పాల్గొన్నారు.

### పునరుద్ధరణ పనులు వేగవంతం చేయాలి

**సీలేరు, సెప్టెంబరు 12 :** సీలేరు చల్లనిశిల్ప ప్రధాన రహదారిల్లో వరద ఉధృతికి మేట వేసిన బురద మట్టిని తొలగించడానికి, బండరాళ్లు, కొండచరియలు,చెట్లను తొలగించే పనులను వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. జీకేవీధి మండలం సీలేరు ధారకొండ ప్రధాన రహదారిలో సీలేరు నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న చల్లనిశిల్ప వరకు ఉన్న మార్గంలో భారీగా కొండచరియ లు, బండరాళ్ళు , చెట్లు బురద మట్టి కొట్టుకు వచ్చిందని, అయితే సీలేరుకు చెందిన ఆర్‌అండ్‌బీ కాంట్రాక్టర్ రెండు జేసీబీలతో నాలుగు రోజులుగా పనులు వేగంగా చేస్తున్నప్పటికీ ఇంకా పనులు పూర్తి కాలేదని, పనులు వేగవంతం కావడానికి మరో రెండు మూడు ఎక్స్‌కవేటర్లను వినియోగించేలా ఆర్ అండ్ బీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### ఆదివాసీ రైతులకు ఐటీడీఏ, జీసీసీ సంయుక్తంగా మార్కెటింగ్ సదుపాయం

**కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ రమేశ్**



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

**చింతపల్లి, సెప్టెంబరు 12 :** గిరిజన ప్రాంతంలో అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామని కేంద్ర కాఫీ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ ఎస్.రమేశ్ తెలిపాతతరు. గురువారం స్థానిక మ్యాక్స్ సమావేశమందిరంలో చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల కాఫీ రైతులతో నాణ్యమైన కాఫీ ఉత్పత్తిపై జీసీసీ, ఐటీడీఏ సంయుక్తంగా సమావేశం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి హాజరైన రమేశ్ మాట్లాడుతూ ఆదివాసీ రైతులు నూతన శాస్త్రీయ పద్ధతులు పాటించకపోవడం వల్ల నాణ్యమైన కాఫీ దిగుబడులు సాధించలేకపోతున్నారని, ధరను కూడా నష్టపోవాల్సి వస్తుందన్నారు.జీసీసీ ఎండీ, పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సంయుక్తంగా గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని కేంద్ర కాఫీ బోర్డు అందజేస్తుందన్నారు. జీసీసీ డీఎం పి.దేవరాజు మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నియంత్రించి, గరిష్ఠ ధరలను రైతుకి అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాక్స్ చైర్మన్ సెగ్గె కొండలరావు, బోర్డు డైరెక్టర్లు, కాఫీ బోర్డు జేఎల్‌వో ప్రదీప్ కుమార్, జీసీసీ కొయ్యూరు మేనేజర్ సరమండ విజయ్ పాల్గొన్నారు.

# వరద నష్టం అపారం

... 5వ పేజీ తరువాయి

వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక, పునరావాస పనులను అధికార యంత్రాంగంగా ముమ్మరంగా చేపట్టింది. దీంతో జిల్లాలో ప్రాణనష్టం పెద్దగా సంభవించలేదు. అలాగే 33 పునరావాస కేంద్రాలను, 153 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసింది. ప్రత్యేకబృందాలు 2,855 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా, 376 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు.అందుకు జిల్లా వ్యాప్తంగా 34 మర బోట్లను అధికారులు, సిబ్బంది వినియోగించారు. బాధిత గ్రామాల్లో రూ.3 కోట్ల 66 లక్షల 89 వేలు విలువ చేసే రేషన్, నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. కలెక్టర్ దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం, అపూర్వభరత్, వివిధ శాఖలకు చెందిన అధికారులు, పోలీసులు యంత్రాంగం, తహసీల్దార్లు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో పాల్గొని బాధిత ప్రజలకు అవసరమైన సేవలు అందించారు.

## జలాశయాల నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

... 5వ పేజీ తరువాయి

తగ్గేంత వరకు నీటి విడుదలను కొనసాగిస్తామని ఒడిశా అధికారులు తెలిపారు. గుంటవాడకు బలిమెల జలాశయం నుంచి 20,200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండడంతో జెన్‌కో అధికారులు కూడా అప్రమత్తమై బుధవారం అర్ధరాత్రి నుంచి మొదట రెండు గేట్లు ఎత్తి దిగువకు 7 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, గురువారం ఉదయం నుంచి మూడు గేట్లు ఎత్తి 11 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నీటితో కలిపి మొత్తం 19 వేల క్యూసెక్కుల నీటిని సీలేరు నుంచి విడుదల అవుతున్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. అలాగే డొంకరాయి జలాశయం నాలుగు గేట్లు ఎత్తి దిగువకు 34,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డొంకరాయి పూర్తిస్థాయి నీటిమట్టం 1,037 అడుగులు కాగా, ప్రస్తుతం ఇక్కడ 1,031.70 అడుగుల నీటిమట్టం ఉందని జెన్‌కో అధికారులు తెలిపారు.